**సమాజ మంతా పురుషాధిక్య ప్రపంచమే అని భయపడింది కాళింది: వివాహబంధంలోని 'అర్ధనారీశ్వర' తత్వాన్ని ఆమె అర్థం చేసుకున్న దెప్పుడు?**

# కాళిందిలో వెన్నెల

గిడుగు రాజేశ్వరరావు

గట్టిగా బిగించి వేసిన జడా, అంగారు బొట్టూ, రంగుల మాచింగ్ సూత్రాల్ని లక్ష్య పెట్టకుండా వేసుకొచ్చిన వదులు జాకెట్టు వరికిణీలో క్లాసుకొచ్చే కాళిందిని మిగతా బాబ్డ్ హేర్స్, పోనీ టైల్స్, రెండు జడలూ, మిడ్డీలూ, స్కర్ట్స్, జీన్స్ లోంచి ఇట్టే గుర్తు పట్టవచ్చు.

"హెూం వర్క్ చెయ్యలేదూ?" కాస్త ఆశ్చర్యంగా అడిగింది నీరజ.

"లేదు" అంటూ దెబ్బతిన్న పులిలా చూసింది కాళింది. మొహం కందిపోయింది. "నిన్న హెూంవర్క్ ఎక్కించుకున్న నోట్ బుక్ నళిని దగ్గర ఉండిపోయింది. తెచ్చుకుందామంటే, ఎక్కడికే దీపాలవేళ అడపిల్లవి అని అమ్మ కసిరింది. తమ్ముణ్ణి తెచ్చి పెట్టమంటే వినకుండా వెళ్ళిపోయాడు" అంటూ ఎన్నో సార్లు మనసులో వల్లించుకున్నట్టు మాటలు గడగడ అప్ప చెప్పేసింది.

"పోనీలే, రేపు చేసుకుని చూపిద్దూ గాని..." శాంత వరచి వెళ్ళిపోయింది నీరజ.

ఇంకో రోజున బెంచీ మీద విల్లు వంచినట్టు ముందుకు వంగిపోయి ఏదో నోట్స్ రాసుకుంటున్న కాళింది వెన్ను మీద చిన్నగా తట్టి "అలా గూనిగా కూర్చోకూడదని ఆరోగ్యశాస్త్రం చెప్తుంది. చిన్నప్పుడే చక్కగా కూర్చోడం అలవాటు చేసుకోవాలి" అని మందలించింది నీరజ.

కాళింది సర్దుకుని నిటారుగా కూర్చుంది. "కాదు టీచర్! జెండాలా కూర్చుంటే ఎలాగే, మగరాయుడిలా నడుస్తానంటే ఎలాగే ఈడొచ్చిన దానివి- అంటూ అమ్మా, అత్తా ఇంట్లో చంపుకు తింటారు" మనసులో ఉన్న కసినంతా ఈ మాటలతో బయటకు వదిలి, తెరిపిన వడ్డట్లు చూసింది టీచర్ వేపు.

ఇలాంటి సంఘటనలలో కాళింది తరచూ నీరజ ఆలోచనల్లోకి వచ్చేది. "తన తప్పులేందీ ఏమన్నా అంటే పడ దీ పిల్ల. వేషంలో సంప్రదాయపు వాసన ఉన్నా వేసే ప్రశ్నలూ, చెప్పే మాటలూ వింటే వ్యవస్థని 'కాలర్' పట్టి నిలదీసినట్లు కనిపిస్తుంది" అని నవ్వుకునేది నీరజ.

"ఆడదాని కీ చదువు చాల్లే అంటారు అమ్మా నాన్నా" అంది ఒక రోజు. చాలా బాధగా తన కష్టాన్ని టీచర్‌తో చెప్పుకుంటూ. పదవ తరగతి వరీక్షల్లో స్కూలు ఫస్టు రాకపోయినా, చాలా మంచి మార్కులతో ఫస్ట్‌క్లాస్ తెచ్చుకున్న కాళిందిని చూసి, 'ఏ ప్రోత్సాహం లేని ఇంట్లోంచి వచ్చి ఇన్ని మార్కులు తెచ్చుకుంది, పాపం' అనుకుంది నీరజ.

ఒకనాడు రోడ్డు మీద తల్లితో కలిసి కోవెల నుంచి వస్తూ ఎదురైంది.

"నమస్కారం టీచర్" అంటూ నిలబెట్టి తల్లిని వరిచయం చేసింది.

"మీ స్కూల్ విడిచి పెట్టినా మిమ్మల్నే తలుస్తుంది మా కాళింది. చదువు ఇంక చాలే, నీకన్నా చదువుకున్న వాణ్ణి కట్నాలు పోసి తేలేం అని నేనూ, వాళ్ళ నాన్నగారూ అంటున్నాం. మీరైనా కాస్త నచ్చ చెప్పండి మా అమ్మాయికి" అని కాళింది తల్లి ప్రాధేయ పడింది.

"కాలేజీకి వెళ్ళను. పోనీ ఇంట్లోనే ఉండి కరస్పాండెన్స్ కోర్సులోనో, ఓపెన్ యూనివర్సిటీ లోనో చదువుకుంటా నంటున్నాను టీచర్" అంది ఆశగా చూస్తూ కాళింది.

"పోనీ, కాళింది కోరినట్లే చదివించండి. బాగా చదువుకుంటున్న పిల్లలో అధైర్యం పాలు పోస్తే ఎలా చెప్పండి?" నీరజ మాట సహాయం చేసింది.

చాలా రోజుల తర్వాత, ఒక సాయంత్రం నీ రెండలో వానకు తడుస్తూ వచ్చింది కాళింది. "కూర్చో ఆంటీ: లోపల అమ్మ పని చేసుకుంటోంది పిలుస్తాను" అన్నాడు ఎనిమిదేళ్ళ నీరజ కొడుకు. వరికిణీ ఓణీలో ఏపుగా, అందంగా ఉన్న కాళిందిని చూస్తూనే- "చాలా రోజులైంది కదూ. ఏమిటిలా వచ్చావ్?" అంది పెరట్లోంచి వస్తున్న నీరజ.

"ఏం చెయ్యను టీచర్, ఎవడో మగ మహారాజు అసహ్యంగా పాడుతూ వెంట పడుతూ ఉంటే ఇలా తప్పించుకు వచ్చాను" అంది విసుగ్గా.

"చదువు కుంటున్నావా? మానేశావా?"


"ఎలాగో ఓలా చదువు సాగిస్తున్నా ఇంట్లోనే. చదువు ప్రారంభించానో, లేదో ఒక నెల అవాంతరం. మా పిన్ని మొగుడు పోతే నేనూ, అమ్మా ఊరు వెళ్ళి వచ్చాం."

"పాపం. ఎంత వయసు మీ పిన్నికి?"

"నా కంటే మూడేళ్ళు పెద్దది. చిన్నప్పుడే పెళ్ళి చేసేశారు. సంపాదన లేదు. తాగి వచ్చి కొట్టేవాడు. ఎవరికీ తెలియకుండా మేం కలిసినప్పుడు నాతో చెప్పుకునేది. తరచూ పుట్టింటి నించి డబ్బు తెమ్మని సతాయించేవాడు. అప్పుడు సరే అలా సుఖపడిం దనుకుంటే మొగుడు పోయేక బంధువులంతా పెట్టిన హింస ఇంతా అంతా నా? అది కళ్ళారా చూశాక పెళ్ళి, జీవితం అంటేనే ఏవగింపై పోయింది."

కాళిందిని కలవర పెట్టిన తతంగ మేమిటో చూచాయగా ఊహించ గలిగినా ఆ పిల్ల ఏం చెప్తుందో అని వింటోంది నీరజ.

"మా పిన్నిని ఎక్కడికో తీసుకుపోయి గాజులూ, బొట్టూ తీసి, వట్టుకున్న దొంగను తెచ్చినట్లు





తెరచాటుగా తెస్తూ ఉంటే ఆ వీధిలోని ఇళ్ళ వాళ్ళంత తలుపులూ, కిటికీలూ మూసుకున్నారు. మృగాన్ని బంధించినట్లు పిన్నిని ఒక గదిలో ఉంచారు. జీలకర్ర నోట్లో వేసుకుని అమ్మలక్క లంత వెళ్ళి చిటికెడు కుంకం విడిచి పెట్టి పిన్నిని చూసి రావడం. ఇదంత చూస్తే ఏడుపొచ్చింది నాకు.''

''నీ లాంటి చిన్న పిల్లల్ని అక్కడ ఎలా ఉండ నిచ్చారు?''

''నేనే కిటికీ లోంచి చూస్తున్నాని. అక్కడితో ఆగిందా? మా అమ్మకు వేలు విడిచిన మేనత్త వచ్చి ఏదో సణుగుతూ మా పిన్నికి జుత్తు తీయించినందుకు వాదనరిపెట్టుకుంది. ముందు ముందు మడి వంటలకి పనికి రాదంది. ఈ లోగా ఎవరో ఒక ముసలావిడ వచ్చి 'మన బతుకు లిట్లా ఏడిశాయి. ఇంక ఈ చిన్న పిల్లల్ని కూడా ఏడిపిస్తే కానీ తోచదా ఏం?' అని గట్టిగా తిట్టి నోరు మూయించింది. ఈ మగ మహారాజుల రాజ్యంలో...''

కన్నె పిల్ల కాళింది పరిశీలనకూ, తర్కానికీ విస్తు పోతున్న నీరజ ఆలోచనలో పడిపోయింది. ''ఈ తరం యువతిని పురుష ద్వేషం ఇలా అణువణువునా శాసిస్తూ ఉంటే మగాడిలో ప్రేమనీ, త్యాగాన్నీ వెలిగించే శక్తి ఇంక ఎవరి కుంటుంది?'' అని మనసులో ప్రశ్నించుకుంది.

''ఎందుకు, టీచర్, ఈ సమాజంలో ఆడదంటే ఇంత చులకన?'' అమాయకంగా అడిగింది కాళింది.

''భలే ప్రశ్నలే నీవి! ఎకనామిక్స్, సోషియాలజీలు చదువు. మొదట్లో వేటాడుతూ ఆహారాన్ని వెతుక్కుంటూ తిరిగే దశలో ఆడా మగా అన్న అసమానత లేవు. ఆడది నాయకత్వం కూడా వహించి వేటలో బాధ్యత తీసుకునేది. కాళీ, మహిషాసుర మర్దనీ ఒక నాటి మాతృస్వామిక సమాజానికి ప్రతీకలే. సేద్యం నేర్చి భూముల్లక్కు అతుక్కుపోయాక స్థిరంగా నివసించడంతో ఇంటిని దిద్దుకుంటూ పిల్లల్ని పెంచడం మెల్లమెల్లగా ఆడదాని బాధ్యతగా సంక్రమించింది. సంపదమీదా, వ్యవస్థ మీదా స్త్రీ పెత్తనం తగ్గుతూ వచ్చింది.''

''మరి ఆ బాధ్యత తక్కువైందా? ఎంత కష్టపడాలి!''

''నిజమే. ఆదాయం, సంపదా తీసుకొస్తున్న మగడి కష్టం అంత స్పష్టంగా ఈ బాధ్యత కంటికి కనపడదు- దాన్ని విలువ కట్టే సంస్కారం ఉండే వాడికీ తప్ప.''

వీధి తలుపు తోసుకుంటూ వస్తున్న మైసమ్మ ''నిన్న రానీకి తీరలే దొరసానీ... నా బిడ్డ కన్నది. మన్మరాలు...ముద్దుగుంది. అంత నా పిల్లగాడి లెక్కనే ఉన్నది. లేకుంటే నిన్ను కష్టపెడతానా?...'' అంది.



చేటంత మొహం చేసుకుని మురుస్తున్న మైసమ్మని చూస్తూ కాళింది ఆశ్చర్యంగా అడిగింది- ''మొదటి కానుపా!'' అని.

కాళింది ఈ ప్రశ్నలో చూపుతున్న ఉత్సాహాన్ని కాస్త విస్తూపోయింది నీరజ.

''లేదు బిడ్డా! గిది రెండో బిడ్డ.'' సంతోషంగా జవాబిచ్చింది మైసమ్మ.

కాళింది మనసును ఇట్టే చదివినట్లు'' రెక్కల కష్టం చేసేటోళ్ళం మా కే బిడ్డ అయితే నేం దొరసానీ'' అనుకుంటూ పని లోకి పోయింది.

''ఎందుకలా అడిగావ్ కాళిందీ?'' నీరజ ప్రశ్న.

''ఏం లేదు టీచర్. మా అక్క రెండోసారి ఆడ పిల్లను కంటే మా బావ ఏడుపు మొహం పెట్టి ఆసుపత్రిలో అందరి ముందూ మా అక్కని తిట్టాడు ఆ తప్పుకి తనే బాధ్యురాల్లాగ. బాధపడి చిన్న మొహం చేసుకుంది అక్క. ఇప్పుడు మళ్ళా కడుపుతో ఉంది. ఎప్పుడూ దిగులుగా ఉంటుంది.''

''అదే చదువుకున్నా మనుకున్న మన బోటి

వాళ్ళకూ, మైనమ్మకూ ఉన్న తేడా. స్వశక్తి మీదా, భవిష్యత్తు మీదా వాళ్ళ కున్న నమ్మకం మన కుండదు. అంత స్వేచ్ఛ కూడా ఉండదు. ఉద్యోగాల వేటకు తప్ప మనోవికాసానికి పనికి రావడం లేదు మరి మన చదువులు.

"నా తమ్ముడు కూడా ఆడ పిల్లల్ని ఏడిపిస్తున్నాడని నళిని చెప్పింది. ఆడ పిల్లలకు చదువు ఎలా సాగుతుంది టీచర్? సమాజంలో స్వేచ్ఛగా తిరిగే ధైర్యం,చదువుకునే అవకాశం మరి ఆడ పిల్లలలకు అక్కర లేదూ?"

"వ్యవస్థలోని అవలక్షణా లన్నిటికీ నువ్వు మాటి మాటికి విసుక్కునే మగ మహారాజులే కారణం అనుకుంటే ఎలా కాళిందీ? పెద్ద మనిషివైన రోజు నుంచీ గుండెల మీద కుంపటి వంటూ నీ ముందే పదే పదే వల్లించి నీలో న్యూనతా భావం. పిరికి తనం రంగరించి పోస్తుంది మీ అమ్మ. ఎంత సేవా శిక్షణా, నమ్రతా ఆడపిల్లకే కావాలి అనుకుంటూ ఎంతో జాగ్రత్త పడే మీ అమ్మ తన కొడుక్కి కూడా సభ్యతా, అణకువా అవసరం అని ఆలోచించకుండా, వా డో మగ మహారాజు అనే భావంతో పెంచి వీధిలోకి వదలడం లేదూ? ఆడదాని బతుకు అరిటాకులా సున్నితమైనదే. మరి మగవాడ్ని ముళ్ళకంపలా పెంచాలని ఎక్కడైనా ఉందా? అలా ఇంట్లోనే కొన్ని విలువలు వంట పట్టించుకుని నీ తమ్ముడో, నా తమ్ముడో వీధిలో ఆడదాన్ని అలుసుగా చిన్న చూపు చూసి, అదే మగతనానికి లక్షణం అనుకుంటే అంతా వాళ్ళ తప్పేనా?"

కాళింది వింటూ ఏదో ఆలోచిస్తోంది. అంతా వింతైన వలయంలా కనిపిస్తోంది ఈ సమాజం. టీచర్ మాటల్లో కొంత నిజం ఉందని ఒప్పుకోవా లనిపిస్తోంది. నీరజ తన మనసులోని మాట ఇంకా చెప్తూనే ఉంది.

"ఒక చిత్రంలో కేవలం ఒక కొన్ని క్షణాలు చేసిన డాన్స్‌కే ఒక లక్షే, రెండో నిర్మాత దగ్గర వసూలు చేసి ఎలా పడితే అలా నిర్మాత కోరినట్లు ఆడే నాట్య తార,తోటి స్త్రీని చులకన చెయ్యడంలో తోడ్పడ్డం లేదూ? ఇంతెందుకు, కట్నాల వేటలోనూ, వధువుల్ని కాల్చడం - వేధించడంలోనూ, అత్తలూ, ఆడపడుచుల హస్తం దృశ్యాదృశ్యంగా తరచూ కనపడడం కూడా మామూలేగా?"

దగ్గరగా ఉన్న అలమరా లోంచి ఒక తెలుగు పుస్తకం తీసి కాళిందికి ఇస్తూ "నిరాడంబరంగా ఆనందంగా చేసుకోవాల్సిన పెళ్ళి విధానంలో కూడా ఎంత తతంగం పెంచుకున్నామో. ఎంత వ్యాపార ధోరణి చోటు చేసుకుందో చూడు. పుస్తె కట్టడం, తలంబ్రాలూ, నాగవల్లి ఇలాంటి వేడుకలూ, విధులూ, తర్వాత కల్పించుకున్నవే కానీ ఏ ఋషులూ విధించినవి కాదని వేదాలూ, స్మృతులూ, 'ధర్మ' సూత్రాలూ తిరగతోడిన రచయిత ఈ పుస్తకంలో ఎన్నో ప్రమాణాలు చూపిస్తూనే చెప్పారు. బాల్య వివాహాల బెడద కూడా మొదట్లో లేదనీ, తర్వాత మనం తెచ్చుకున్న అవలక్షణమే అని ఎంతో తార్కికంగా చెప్పుకొచ్చారు."

"మరి ఇలా ఎందుకు చేసుకున్నాం?" బేలగా అడిగింది కాళింది.

"బౌద్ధ, జైన మతాలు ఒక కుదుపు కుదిపిన తర్వాత, వైదిక జీవన విధానం, దాని అస్తిత్వం నిలబెట్టుకొనే ఆత్రంలో నియమ నిష్ఠలూ, విధులూ పెంచుకుంటూ వచ్చింది. రాను రాను అందులో వ్యాపార ధోరణి పెరుగుతూ వచ్చింది.

"మధ్య యుగంలో పరదేశం నుంచి వచ్చి పడ్డ దండయాత్రలూ, ఆ తరువాత విజృంభించిన థగ్గులూ, దోపిడీ ముఠాలూ, అరాచకాలు చేస్తూ ఆడపిల్లల్ని కన్న వాళ్ళ మనసుల్లో భయాన్ని పెంచేశారు. బాల్య వివాహాలు చేసి ఒక మగవాడి చేతుల్లో పడేస్తే బాధ్యత వదులుతుందనే ఆత్రత పెరిగింది. ఈ సందడిలో స్త్రీకి చదువూ, వ్యక్తిత్వం కంటే పెళ్ళి చాలా ముఖ్యం అనే ఆలోచన వేళ్ళు నాటుకుంది.

"నేను పెద్ద క్లాసు తీసేసుకుని నిన్ను బోరు కొడుతున్నట్లున్నాను. అంకుల్ ఆఫీసు నుంచి వచ్చే టైం అయింది" అంది నీరజ.

"లేదాంటీ! నాకు తెలీన వెన్నో చెప్పారు. చాలా ఆసక్తి కరంగా ఉంది." వింటోంది కాళింది.

"రాజా రాంమోహన్‌రాయ్, ఈశ్వరచంద్రుడూ, కందుకూరీ... వీళ్ళంతా మగవాళ్ళే కదా. మగవాడే ఆడ దానికి శత్రు వనుకోడం ఎంత పొరపాటైన ఆలోచనో, ఆడది మగవాడికి శత్రువనీ, అన్ని అనర్థాలకూ కారణం అని అనుకోవడం కూడా అంత అర్థం లేని ఊహే. ఇవాళకి మన చర్చ ఆపేద్దాం. అదిగో, అంకుల్ కూడా వచ్చేశారు" అంటూ కాళిందిని భర్తకు పరిచయం చేసి, "ఒక్క క్షణం ఉండు- మాతో కాస్త టీ తాగి వెళ్ళిపోదూ గాని" అని ఆపింది నీరజ.

ట్రేలో టీ కప్పులతో వచ్చిన నీరజ "అదేంటండీ, మాటా మంతీ లేకుండా అలా సీరియస్‌గా కూర్చున్నారు. ఏదైనా చిక్కు ప్రశ్న కానీ మోసు కొచ్చారా ఆఫీసు నుంచి?" అని అడిగింది భర్తనూ చూస్తూ.

"చిక్కు ప్రశ్నంటే కాస్త చిక్కు ప్రశ్నే. 'ఔరంగాబాద్‌లో పెడుతున్న కొత్త రీజినల్ ఆఫీసుకి నిన్ను ప్రొమోషన్ మీద పంపాలని ఆలోచిస్తున్నాను' అన్నాడు మా బాస్ నా అభిప్రాయం అడుగుతూ. నేను కొంత వ్యవధి ఇస్తే ఆలోచించి చెప్తానని అన్నా..."

"ఆలోచన దేనికీ...ప్రమోషన్ ఇస్తానంటుంటే."

"మరి నువ్వు స్కూల్లో ఇప్పుడిప్పుడే స్థిర పడుతున్నావు. నే నక్కడా, ను వ్విక్కడా ఉంటే మన బాబు చదువు పాడవుతుందేమో. వాడు ఈ మార్పుకు ఎలా అలవాటు పడగలడో అని సందేహిస్తున్నాను. నువ్వూ, నేనూ ఇటూ అటూ తిరక్క తప్పదు."

"ఇదేనా సమస్య? ఔరంగాబాద్‌లో స్కూళ్ళు ఉన్నాయి. నెమ్మదిగా ప్రయత్నం చేస్తే నాకు ఆ మాత్రం ఉద్యోగం ఏ ప్రైవేట్ స్కూల్లో నైనా దొరక్క పోదు. ఈ ఊరు మనదా? ఆ ఊరు కాకపోతుందా?"

వాళ్ళ సమస్యా పరిష్కారాన్ని వాళ్ళకు వదిలి పెట్టి సెలవు తీసుకుంది కాళింది. కానీ వాళ్ళ సమస్యల్ని పరస్పరం పరిష్కరించుకోవడం

## బాంక్

బాంకింగ్ కార్యకలాపాలు మన దేశంలో వేదకాలం నుంచే కొనసాగుతున్నాయి. అయితే బాంక్ అనే పదం మధ్య యుగంలో ఇటలీలో వెనిస్ బాంక్ ప్రారంభించినప్పుడే మొదటిసారిగా వాడుకలోకి వచ్చింది. ఉమ్మడి ద్రవ్యనిధికి ఇటలీ భాషలో మాంటి అని పేరు. దానికి జర్మన్ భాషలో పర్యాయపదం బాంక్. ఇటలీలో దీన్ని బాంకో అంటారు. ఫ్రెంచిలో ఇది బాంకీ అయింది. ఆంగ్లంలో బాంకీ బాంక్‌గా మారింది. 1694లో ఇంగ్లండ్ దేశంలో బాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ప్రారంభంతో ఆధునిక బాంక్‌కి అంకురార్పణ జరిగింది.

సమ్మెట గోవర్ధన్



చూస్తూ ఉంటే ఇంట్లోకి అడుగు పెడుతూనే రుసరుసలాడే తన తండ్రీ, భర్త అవతలకి వెళ్ళగానే ఊపిరి పీల్చుకునే తన తల్లి మనసులో మెదిలారు.

*****

ఔరంగాబాద్ స్టేషన్‌లో ఆగిన రైలును రెండు మార్లు సర్వే చేసి తమ్ముడు రాలేదని నిర్ధారించుకుని ఇంటి ముఖం పట్టింది నీరజ. గేటు దగ్గర టిక్కట్ ఇచ్చి బయటకు వెళ్తున్న అమ్మాయిని చూసి "కాళిందీ !" అని కేక వేసింది.

ఉలికి పాటుగా వెనక్కు చూసిన కాళింది ఆశ్చర్యంగా "మీ కెలా తెలుసు నేను వస్తున్నట్లు?" అని అడిగింది.

"మా తమ్ముడు వస్తున్నట్లు ఉత్తరం వస్తే వచ్చాను. ఇంతకీ ను వ్విక్కడికి ఎలా వచ్చినట్లు? నీకు ఇక్కడ బంధువు లున్నట్లు ఎప్పుడూ చెప్పలేదే?"

జవాబు సులభంగా రావడం లేదు. మాట్లాడ బోతే వర్షించే మబ్బుల్లా ఉన్నాయి కళ్ళు.

"తరువాత మాట్లాడుదాంలే, ఇంటికి పద" అని స్థిమితపరిచి కాళిందిని తీసుకుపోయింది నీరజ. రాత్రి భోజనం చేశాక "కనీనం ఇంట్లో చెప్పి వచ్చావా? మీ వాళ్ళు కంగారు పడతారు." నిలదీసింది నీరజ.

'లే' దన్నట్లు తల ఊపింది కాళింది.

"సరే రేపు మీ వాళ్ళకి ఇక్కడ క్షేమంగా ఉన్నట్లు తెలియజేస్తాను. ఎందు కిలా నన్ను వెతుక్కుంటూ పారిపోయొచ్చావో కాస్త చెప్పు" అంది నీరజ.

"మీరు చెప్పినట్లే చదువుకుని డిగ్రీ పరీక్షకు కూర్చున్నాను. బాగానే రాశాను. ఈ లోగా పెళ్ళి అంటూ నా మీద ఒత్తిడి చేశారు- ఇంట్లో."

"పోనీ పెళ్ళికి నీ అభ్యంతర మేంటి?"

"నాలుగైదు సార్లు పెళ్ళి చూపుల తతంగం అయినాక కట్నం చాలదనో, జాతకాలనో వెనక్కు పోయారు చూసిన వాళ్ళు. అందుకని మేనమామకే ఇస్తానని కూర్చున్నారు అమ్మా నాన్నా. ఆలాంటి పెళ్ళిళ్ళు అసలు ఆరోగ్యకరం కాదని ఎన్నో పుస్తకాల్లో చదివాను. నా చదువు పూర్తి అయినాక కానీ ఆ విషయం ఆలోచించాలని లేదు. నాకు పెళ్ళన్నా మగవాళ్ళన్నా ఏదో భయం ఆవరించినట్టుంది. అక్కను చులకన చేసే బావ, పిన్నిని బతికున్నన్నాళ్ళూ చిత్రహింసలు పెట్టి పోయిన పిన తండ్రీ, చదువూ, ఉద్యోగం లేకుండా గాలి పట్టి పోతున్న తమ్ముడూ...నేను నిరాశావాదిగా మారి పోతున్నా నేమో" అని వస్తున్న దుఃఖాన్ని ఆపుకుందుకు ప్రయత్నిస్తోంది కాళింది.

"నీ కేం భయంలేదు కాళిందీ. నేను మీ నాన్న గారికి నచ్చ చెప్తాగా! ఇవాళ్టికి హాయిగా నిద్రపో." భరోసా ఇస్తూ అంది నీరజ.

*****

"సారీ అక్కా, నిన్న రైలు తప్పిపోయాను. బావ గారింకా నిద్ర లేవలేదా?" అంటూ హడావిడిగా ఇంట్లో అడుగు పెడుతున్న సుధాకరం అక్కడ

## రిజర్వ్ బాంక్ ఆఫ్ ఇండియా

ప్రతి దేశంలో ఆ దేశంలోని బాంకింగ్ వ్యవస్థనీ, పరపతినీ నియంత్రణ చెయ్యటానికి ఒక కేంద్ర బాంక్ ఉంటుంది. భారత రిజర్వ్ బాంక్ మన దేశానికి కేంద్ర బాంక్. దీన్ని 1935లో వాటాదార్ల బాంక్‌గా స్థాపించారు. 1948లో ఒక చట్టం ద్వారా జాతీయం చేశారు. దీని పరిపాలనా వ్యవహారాలు చూడటానికి ఒక గవర్నరు, ముగ్గురు డిప్యూటీ గవర్నర్లతో సహా 15 మంది డైరెక్టర్లతో కేంద్ర డైరెక్టర్ల బోర్డు ఉంటుంది. రిజర్వ్ బాంక్ ప్రధాన కార్యాలయం బొంబాయిలో ఉంది.

నమ్మెట గోవర్ధన్

కూర్చున్న కాళిందిని చూసి సంకోచిస్తూ స్వరం తగ్గించి- "నీరజక్క..." అంటున్నాడు.

అప్పుడే టీ కలుపుకుని వస్తున్న నీరజ "ఈ అమ్మాయి ఎవరో కాదు- నా స్టూడెంట్ కాళింది" అని పరిచయం చేసింది. "మీ బావ కాంపు నుంచి రావడానికి నాలుగైదు రోజులవుతుం దన్నారు" అని టీ కప్పు అందించింది.

"నాకు మూడు రోజులే సెలవు ఉంది. అజంతా, ఎల్లోరా గుహలు చూడాలని వచ్చాను. ఎన్నో సార్లు చూద్దా మనుకున్నా ఇంత వరకూ కుదరలేదు. ప్రస్తుతం ఈవిడ ఏం చేస్తున్నారు?" అని కాళిందిని చూస్తూ అక్కను అడిగాడు.

"పరీక్ష రాసింది. అంటే ఇంక గ్రాడ్యుయేషన్ అయినట్లే. స్త్రీలకు స్వేచ్ఛా, సమాన హక్కులూ కావాలనీ, ఇంక నీలాంటి మగ మహారాజుల జులుం కొనసాగరాదనీ సమరం సాగించే ప్రయత్నంలో ఉంటుంది."

అక్క మాటలకు గల గల నవ్వాడు సుధ. "సమాన హక్కులేంటి? స న్నడుగుతే స్త్రీకి పురుషుడి కంటే ఎక్కువ హక్కులూ, చదువూ ఉండాలంటాను. ఈ సృష్టిలో కొత్త తరానికి ఊపిరి పొయ్యడంలో మగాడితో బాటు ఆడదీ సగం బాధ్యత వహిస్తోంది. అంటే యాభై శాతం బాధ్యత. ఆ పసి తరాన్ని అంటే శిశు తరాన్ని తన శరీరంలోనే భాగంగా ఉంచుకొని రక్షిస్తూ, బయట ప్రపంచంలో కొచ్చి పడ్డాక కూడా, తన కాళ్ళ మీద నిలిచే దాకా కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటుంది. ఇది అదనపు బాధ్యత. అందుకే చదువూ, వికాసం స్త్రీకే కాస్త ఎక్కువ కావాలి. స్వేచ్ఛ కూడా దానితో పాటే..." అంటూ టీ తాగుతున్నాడు.

*****

నెమ్మదిగా నిశితంగా ఎల్లోరా గుహల్ని చూస్తున్న సుధాకరం శ్రద్ధకు ఆశ్చర్యపోయింది కాళింది. ఆ గుంపులో ఒక టూరిస్టు అమెరికా నుంచి వచ్చింది. ఒక కుడ్య శిల్పాన్ని చూసి ఆశ్చర్యంగా "వాటీజ్ దిస్ ఎనిగ్మాటిక్ ఫామ్?" అంటోంది. గైడ్ తనకు తోచిందేదో చెప్తూ ఆమెను తృప్తి పరచలేక నీళ్ళు నములుతున్నాడు. దగ్గరగానే ఉన్న సుధాకరం "మే ఐ హెల్ప్‌యూ విత్ వాట్ లిటిల్ ఐ నో?" అంటూ అక్కడ ఉన్న అర్ధ నారీశ్వరుణ్ణి చూపిస్తూ స్పష్టమైన ఇంగ్లీషులో నెమ్మదిగా వివరణ ఇస్తున్నాడు.

"ఆత్మ బలంతోనే ఆగకుండా సాగుతున్న ఈ విశాల విశ్వాన్నే.., ఈ కాస్మాస్‌నే, ఈ చరాచరా జగత్తునే పరమేశ్వర మూర్తిగా రూపకల్పన చేసి కీర్తించుకున్నారు ప్రాచీనులు. ఈ పరమేశ్వర రూపంలో అర్ధ భాగం స్త్రీ శక్తి. మన రెండూ కళ్ళూ స్థూలంగా చూస్తే వేరు వేరుగా కనుపిస్తాయి. కానీ ఆ రెండూ ఒకే లక్ష్యంతో పని చేస్తాయి. వాటి సమన్వయంతోనే సమగ్రంగా, నిర్దుష్టంగా జీవితాన్ని ప్రపంచాన్ని చూడగల దృష్టిని సాధిస్తాం. స్త్రీ శక్తికీ, పురుష శక్తికీ ఉన్న ఈ అవినాభావ సంబంధం, ఈ మైత్రీ భావం సకల సృష్టికీ ఆధార భూతం, శుభకరం. ఈ ఉదాత్త భావనకు రూప కల్పనే ఈ అర్ధ నారీశ్వరుడు." సుధ చెప్పింది వింటూ ఆవిడ తన డైరీలో ఏదో నోట్స్ రాసుకుంటోంది.

ఇంత చిన్న వయసులోనే తాత్త్వికి వివరణ ఇస్తున్న తమ్ముడి భాష్యాన్ని వింటూ చిన్నగా నవ్వుకొంటున్న నీరజకు ఎప్పుడో చదివిన "ఏ ప్రేమ మహిమచే నెల్ల నక్షత్రాలు నేల రాలక మింట నిలిచి యుండు" అన్న పద్యం గుర్తు కొచ్చింది. అలవోకగా కాళింది వేపు చూసింది.

విశాలమైన ఆ కాటుక కళ్ళలో తరచూ కానవచ్చే నీలి నీడలు లేవు. సుధాకరాన్ని తదేకంగా చూస్తూ మంద్రస్థాయిలో వినిపిస్తున్న అతని విశ్వ ప్రేమతత్త్వాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లుంది.

ఆ కళ్ళలో ఏదో విచిత్రమైన ప్రశాంతి! ఏదో వెన్నెల! ఏదో వెలుగు!

